సాక్షి
అనంతపురం
శుక్రవారం । 1 । డిసెంబర్ । 2023



నియంత్రణలో హెచ్ఐవీ

జిల్లాలో హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణకు వైద్య సిబ్బంది పటిష్ట చర్యలు తీసుకున్నారు. వైరస్ వ్యాప్తిని అరికట్టారు. IIలో



కిలో టమాట రూ.24

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.24, కనిష్టంగా రూ.10, సరాసరిన రూ.15 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
34.9°/ 19.5°

జిల్లా అంతటా గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. ఉదయం వేళ చలి వాతావరణం కొనసాగుతోంది.

న్యూస్‌రీల్

జీవన ప్రమాణాలు మెరుగుపర్చుకోండి



సెప్టిక్ ట్యాంక్ క్లీన్ వాహనాలను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: ప్రభుత్వం సబ్సిడీ ద్వారా పంపిణీ చేసిన సెప్టిక్ ట్యాంక్ క్లీన్ వాహనాలను సద్వినియోగం చేసుకుని, జీవన ప్రమాణాలు మెరుగుపర్చుకోవాలని సఫాయి కర్మచారీలకు కలెక్టర్ గౌతమి సూచించారు. జిల్లాకు చేరిన వాహనాలను కలెక్టర్ గురువారం పరిశీలించారు. వివరాలను కలెక్టర్‌కు ఎస్సీ కార్పొరేషన్ అధికారి సారయ్య వివరించారు. జిల్లాకు మూడు, శ్రీ సత్యసాయి జిల్లాకు ఒక వాహనాన్ని ప్రభుత్వం పంపిణీ చేసిందని చెప్పారు. ఒక్కో వాహనం విలువ రూ.31.67 లక్షలని తెలిపారు. ఇందులో 50 శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహించాల్సి ఉందని చెప్పారు. కలెక్టర్ మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి చేసి సఫాయి కర్మచారీలకు వాహనాలు అందించాలని ఆదేశించారు.

11 నుంచి 'కళా ఉత్సవ్' పోటీలు

పుట్టపర్తి: బుక్కపట్నం ఉపాధ్యాయ శిక్షణ సంస్థ (డైట్)లో ఈనెల 11, 12 తేదీల్లో కళా ఉత్సవ్ పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉన్నత పాఠశాల విద్యార్థులు పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. 9, 10వ తరగతితో పాటు ఇంటర్ విద్యార్థులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. నాటకీకరణ, నృత్యం, మ్యూజిక్, ఫోక్ డ్యాన్స్ తదితర పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థుల పేర్ల నమోదుకు ఆయా పాఠశాలల హెచ్ఎంలు చొరవ చూపాలన్నారు. పోటీల్లో విజేతలు 14, 15వ తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాలకు పి.లక్ష్మీనారాయణ సెల్ నంబర్: 9440944737, సురేష్‌బాబు సెల్ నంబర్ : 9440513218లో సంప్రదించాలన్నారు.

త్వరలో ఆమిద్యాల-రాకెట్ల లిఫ్ట్ పనులు

- హెచ్ఎన్ఎస్ఎస్ ఈఈ గనేనాయక్



భూములను పరిశీలిస్తున్న హెచ్ఎన్ఎస్ఎస్ ఈఈ గనేనాయక్

ఉరవకొండ: మండల పరిధిలోని రాకెట్ల వద్ద హంద్రీనీవా సుజల స్రవంతి కాలువపై ఆమిద్యాల-రాకెట్ల లిఫ్ట్ పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు హెచ్ఎన్ఎస్ఎస్ ఈఈ గనేనాయక్ తెలిపారు. మండల పరిధిలోని రాకెట్ల వద్ద లిఫ్ట్ కోసం రైతులు ఇచ్చిన భూములను గురువారం ఈఈతో పాటు డీఈఈ లక్ష్మీదేవి, ఏఈ చామంతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ మండలంలోని ఆమిద్యాల, రాకెట్ల, కొకుంట్ల గ్రామాల్లోని 8 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. భూములు కోల్పోయిన రైతుల ఖాతాల్లో రూ.850 కోట్ల పరిహారం జమ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. 80 మందికి త్వరలో నగదు జమవుతుందన్నారు. ఇప్పటికే కాలువ తవ్వే పనులు ప్రారంభించినట్లు తెలిపారు.

3 నుంచి ఓపెన్ డిగ్రీ మూడో సెమిస్టర్ తరగతులు



అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ఆర్ట్స్ కళాశాలలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రంలో డిగ్రీ విద్యార్థులకు మూడో సెమిస్టర్ తరగతులు ఈనెల 3 నుంచి ప్రారంభమవుతాయని కోఆర్డినేటర్ డాక్టర్ ఏ.శేషారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి, రెండు సంవత్సరాల స్పెల్-2, డిప్లొమా పరీక్షల ఫీజు డిసెంబరు 11 లోపు చెల్లించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 73829 29602 నంబరులో సంప్రదించాలని కోరారు.

సుఖంగా ప్రసవం!



గర్భిణుల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. పౌష్టికాహారం అందించడమే కాకుండా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయిస్తోంది. పీహెచ్‌సీల నుంచి సీహెచ్‌సీల వరకూ అనుసంధానించి మారుమూల గ్రామాల్లోని వారికి సైతం మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపట్టింది. దీంతో మాతృ మరణాలు గణనీయంగా తగ్గాయి.

- ఉమ్మడి జిల్లాలో తగ్గిన హైరిస్క్ గర్భిణులు
- రాయలసీమ జిల్లాల్లో అత్యంత తక్కువ
- మాతృమరణాల కట్టడికి పకడ్బందీ చర్యలు
- క్రమం తప్పని పౌష్టికాహారం, వైద్యసేవల ట్రాకింగ్‌తో ఫలితం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీసుకుంటున్న విప్లవాత్మక నిర్ణయాలు సత్ఫలితాలిస్తున్నాయి. దేశానికే ఆదర్శంగా అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలతో ఉమ్మడి జిల్లాలో హైరిస్క్ గర్భిణుల సంఖ్య తగ్గుముఖం పడుతోంది. సుఖప్రసవాలకు మార్గం సుగమమవుతోంది. ఒక వైపు స్త్రీ శిశు సంక్షేమశాఖ గర్భిణులకు పౌష్టికాహారం అందించి రక్తహీనత నియంత్రిస్తుండగా, మరో వైపు వైద్య ఆరోగ్యశాఖ హై రిస్క్ ప్రెగ్నెన్సీ (కష్టకాన్పులకు దగ్గరగా ఉన్న గర్భిణులను) గుర్తించి, వైద్యపరంగా అన్నివిధాలా చేయూతనిస్తోంది.

క్రమం తప్పకుండా పరీక్షలు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో హైరిస్క్ ప్రెగ్నెన్సీలు గతంలో 20 శాతం పైనే ఉండేవి. నేడు దాదాపు 13 శాతానికే పరిమితమవుతున్నాయి. గడిచిన నాలుగేళ్లలో ఆరోగ్యశాఖ తీసుకున్న చర్యలే ఇందుకు కారణంగా తెలుస్తోంది.

- ఫ్యామిలీ డాక్టర్ విధానం అమల్లోకి వచ్చాక గర్భిణులు, బాలింతల వివరాలు జల్లెడ పట్టి మరీ వైద్యసేవలు అందిస్తున్నారు.
- ఏఎన్ఎంలకు ప్రత్యేక యాప్ ద్వారా ఊరూరా గర్భిణులను గుర్తించి, వారిని క్రమం తప్పకుండా ఆస్పత్రులకు తీసుకొచ్చి యాంటీనేటల్ చెకప్ చేయిస్తున్నారు
- 'జగనన్న ఆరోగ్య సురక్ష' క్యాంపుల ద్వారా ప్రతి గ్రామంలో వలంటీర్ల ద్వారా బాధితులను క్యాంపులకు తీసుకొచ్చి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు.
- 104 వాహనాల ద్వారా ఇంటివద్దకే వైద్యులు వెళ్లి రక్తపరీక్షలు నిర్వహించడంతో పాటు నెలవారీ ఆరోగ్యవివరాలు సేకరించి చికిత్స చేస్తున్నారు.
- హైరిస్క్ ప్రెగ్నెన్సీలకు ప్రత్యేక రెఫరల్ సిస్టం ద్వారా అవసరమైతే పెద్దాసుపత్రులకు పంపించి వైద్యం చేసే ఏర్పాట్లు చేశారు.
- మారుమూల గ్రామంలో గర్భిణులు ఉన్నా సరే.. 108కు కాల్ చేయగానే 15 నిముషాల్లో అంబులెన్సు వచ్చి కాన్పుల వార్డుకు చేరుస్తోంది.
- స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నారు.
- ఉమ్మడి అనంతపురం హై రిస్కు గర్భిణులుగా గుర్తించిన వారిలో 99.5 శాతం మందికి రిస్కు గ్రూపునుంచి విముక్తి కల్పించారు.
- హైరిస్కు ప్రమాదం తగ్గడంతో మాతృ మరణాలు గణనీయంగా తగ్గాయి.



ఇక్కడ మంచంపై కూర్చుని ఉన్న నిండు గర్భిణి పేరు జి.అనిత. కళ్యాణదుర్గం మండలం దురదకుంట గ్రామం. సచివాలయ ఏఎన్ఎం వరలక్ష్మి, ఆశా వర్కర్లు ప్రతి నెలా అనిత ఇంటికి వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారు. గ్రామంలో 104 వాహనం వచ్చినప్పుడు అన్ని పరీక్షలు చేస్తున్నారు. హెచ్‌బీ, బీపీ, షుగర్ నార్మల్‌గా ఉన్నాయి. ఇంటి దగ్గరకు డాక్టర్ వచ్చి చూస్తుంటే చాలా సంతోషమేస్తోందని, తనకు, బిడ్డకు ఆరోగ్యాన్ని ప్రసాదిస్తున్నది సీఎం జగనన్నే అని అనిత ఆనందంగా తెలిపింది.

గత 10 నెలల్లో రాయలసీమ జిల్లాల్లో గణాంకాలు ఇలా..

జిల్లా	గర్భిణుల నమోదు	హైరిస్క్ ప్రెగ్నెన్సీ
కర్నూలు	32,333	5,880
నంద్యాల	19,211	3,150
వైఎస్సార్	26,642	4,341
అన్నమయ్య	28,228	2,953
తిరుపతి	23,798	3,812
చిత్తూరు	20,460	3,217
అనంతపురం	27,867	3,886
శ్రీ సత్యసాయి	20,460	2,826

ఫ్యామిలీ డాక్టర్‌తో మేలు

ఫ్యామిలీ డాక్టర్ విధానం సత్ఫలితాలనిస్తోంది. గర్భిణుల సమస్యలు ప్రాథమిక దశలో గుర్తించే అవకాశం లభించింది. గ్రామ స్థాయిలోనే హైరిస్క్ ఉన్న పేషెంట్లను గుర్తిస్తున్నాం. పీహెచ్‌సీల నుంచి సీహెచ్‌సీల వరకూ అనుసంధానం చేసుకుని వారి వివరాలను అందుబాటులో ఉంచుతున్నాం. పీహెచ్‌సీలలో వైద్య పరీక్షలు నిర్వహించి ఏరియా ఆసుపత్రులు లేదా జిల్లా ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నాం.
– డాక్టర్ మాధవి, మెడికల్ ఆఫీసర్, సీహెచ్‌సీ, కళ్యాణదుర్గం

ఎన్నికల విధుల్లో సెక్టార్ అధికారులు కీలకం



మాట్లాడుతున్న నోడల్ అధికారి నరసింహారెడ్డి

అనంతపురం అర్బన్: ఎన్నికల విధుల్లో సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీసు అధికారులది కీలకపాత్ర అని ఎన్నికల ట్రైనీ నోడల్ అధికారులు నరసింహారెడ్డి, అశోక్‌కుమార్ రెడ్డి సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో నియోజకవర్గాలకు చెందిన సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీసు అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024లో జరగనున్న సాధారణ ఎన్నికలకు 233 మంది సెక్టార్ అధికారులు, 233 మంది సెక్టార్ పోలీసు అధికారులను నియమించామన్నారు. కేటాయించిన విధుల్ని అప్రమత్తతతో నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని 8 నియోజకవర్గాల పరిధిలో 2,213 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వీటిలో సమస్యాత్మక కేంద్రాలు, అత్యంత సమస్యాత్మక కేంద్రాలను పోలీసు సెక్టార్ అధికారులు సందర్శించాలన్నారు. సూక్ష్మ స్థాయిలో పరిశీలించి సమగ్ర నివేదిక అందించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎన్నికల డీటీ కనకరాజు, ఎస్‌ఏ శామ్యూల్ బెంజిమెన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

3న విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

అనంతపురం రూరల్: నగరంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో ఆదివారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఏడీ అబ్దుల్‌రసూల్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు, మేధావులు, విద్యార్థులు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

కురుబలకు రాజకీయంగా పెద్దపీట



కనకదాస విగ్రహం వద్ద నివాళులర్పించిన మంత్రి ఉషశ్రీచరణ్, కలెక్టర్ గౌతమి, తదితరులు



కనకదాస జయంత్యుత్సవాల్లో పాల్గొన్న కురుబ సంఘాల ప్రతినిధులు, నాయకులు,

- మంత్రి ఉషశ్రీ చరణ్
- ఘనంగా రాష్ట్రస్థాయి కనకదాస జయంత్యుత్సవం

అనంతపురం టవర్‌క్లాక్: గత ప్రభుత్వం కురుబలను ఓటు బ్యాంకుగా వాడుకుంటే, జగనన్న ప్రభుత్వం రాజకీయంగా అవకాశాలు కల్పించి పెద్దపీట వేసిందని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ తెలిపారు. కురుబల ఆరాధ్యదైవం కనకదాస జయంత్యుత్సవాన్ని నగరంలో గురువారం రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక గుత్తి రోడ్డులో ఉన్న కనకదాస విగ్రహానికి మంత్రి ఉషశ్రీ చరణ్‌తో పాటు కలెక్టర్ గౌతమి, ఎంపీ గోరంట్ల మాధవ్, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు నివాళులర్పించారు. అనంతరం కనకదాస కల్యాణమండపంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ ఎంపీ, మంత్రి పదవులివ్వడమే కాకుండా పెద్ద సంఖ్యలో సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, కౌన్సిలర్లు, మార్కెట్ యార్డు చైర్మన్లుగా అవకాశం ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కుల వృత్తిలో ఉన్న కురుబలను గుర్తించి ప్రభుత్వం చేయూతనిస్తోందన్నారు. వీధి వ్యాపారాలు చేసుకునే కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటున్నామన్నారు. సమస్యల పరిష్కారం కోసం కురుబ కార్పొరేషన్ ఏర్పాటు చేశామన్నారు. కుల గణన చేపట్టి బీసీల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వం అధికారికంగా కనకదాస జయంతి మహోత్సవం నిర్వహించడం గర్వకారణమన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. భక్త కనకదాస కీర్తనలను కురుబ కులస్తులు పిల్లలకు నేర్పించాలని కోరారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అన్ని విధాలా మంచి చేసిన సీఎం జగన్‌కు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. కనకదాస జయంత్యుత్సవం సందర్భంగా గురవయ్యల నృత్యం, చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కురుబలు ఐక్యతగా ఉండాలంటూ మంత్రి ఉషశ్రీ చరణ్ ఢమరుకం వాయించడం ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, రాష్ట్ర నాటక అకాడమీ మాజీ చైర్‌పర్సన్ హరిత, సీఐ అన్నపూర్ణ, ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ పామిడి వీరాంజనేయులు, మాజీ మేయర్ రాగే పరశురాం, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఉమాదేవి, బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూకొఠారి, విశ్రాంత జడ్జి కిష్టప్ప, రాష్ట్ర కురుబ సంఘం అధ్యక్షుడు జబ్బల శ్రీనివాస్, జిల్లా కురుబ సంఘం అధ్యక్షులు ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య, కూడేరు జెడ్పీటీసీ అశ్విని హరీష్, వసికేరి రమేష్, బ్యాళ్ల నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రం సస్యశ్యామలం



చెన్నంపల్లిలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

బుక్కరాయసముద్రం: రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండాలంటే సీఎంగా జగనన్నే ఉండాలని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. గురువారం బుక్కరాయసముద్రం మండలం చెన్నంపల్లిలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' నిర్వహించారు. నియోజకవర్గంలో కార్యక్రమం ముగిసిన సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామస్తులు సంబరాలు నిర్వహించారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ సలహాదారు (విద్య) ఆలూరి సాంబ శివారెడ్డికి పూలమాలలతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లారు. ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో 158 రోజుల పాటు 90 సచివాలయాల పరిధిలో కార్యక్రమం నిర్వహించామన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించామన్నారు. చంద్రబాబు హయాంలో ఒక్క చెరువుకైనా నీరు అందించారా అని ఆమె ప్రశ్నించారు. కరువు కాటకాలతో ప్రజలు ఇబ్బందుల పాలైనా పట్టించుకోలేదని విమర్శించారు. జగనన్న తన ప్రజా సంకల్ప పాదయాత్రలో ప్రజల కష్టాలు తెలుసుకుని పేదలకు అనుగుణంగా మేనిఫెస్టో రూపొందించారన్నారు. అధికారంలోకి రాగానే సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి సంక్షేమ పథకాలు ప్రజల ముంగిటకే అందించారన్నారు. శింగనమల నియోజకవర్గంలో అన్ని చెరువులు నీటితో నింపామన్నారు. పంటలకు నీటి కొరత లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. పథకాలు కొనసాగాలంటే మరోసారి జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గువ్వల రాజశేఖరెడ్డి, సహకార సంఘం సొసైటీ అధ్యక్షులు వెంకటరెడ్డి, గువ్వల శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీపీ సునీత, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, జెడ్పీటీసీ భాస్కర్, ఎంపీడీఓ తేజోత్స్న, ఆలూరి రమణారెడ్డి, మండల కన్వీనర్ అంకే నరేష్, యువ నాయకుడు ఆలూరి ఎర్రిస్వామి రెడ్డి, గువ్వల సురేష్‌రెడ్డి, ఎంపీటీసీ నాగప్ప, జేసీఎస్ మండల కన్వీనర్ బయపరెడ్డి, ఎస్టీసెల్ అధ్యక్షులు సాకే రామకృష్ణ, పూల నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రేషన్ పంపిణీ



సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

అనంతపురం అర్బన్: జిల్లాలోని బియ్యం కార్డుదారులకు డిసెంబరు నెల కోటాకు సంబంధించిన బియ్యం, నిత్యావసర సరుకులు శుక్రవారం నుంచి పంపిణీ చేస్తారని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్డుదారుని కోరిక మేరకు బియ్యం స్థానంలో కిలో నుంచి మూడు కిలోల వరకు రాగులు కూడా అందిస్తారని పేర్కొన్నారు. ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దకే వచ్చి బియ్యం, సరుకులు అందిస్తారన్నారు. పంపిణీ విషయంలో సమస్యలుంటే సంబంధిత తహసీల్దార్లు, సీఎస్‌డీటీలను కార్డుదారులు సంప్రదించాలని జేసీ సూచించారు.

వైభవం.. కడ్లే గౌరమ్మ రథోత్సవం

విడపనకల్లు: మండలంలోని వివిధ గ్రామాల్లో కడ్లే గౌరమ్మ రథోత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా జరిగాయి. గత నెల 27న ప్రారంభమైన గౌరమ్మ ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. ఆడపడుచులు చక్కెర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున 4 గంటలకు విశేష పూలతో అలంకరించిన రథంపై కడ్లే గౌరీదేవి ప్రతిమను అధిష్ఠింపజేసి పుర వీధుల్లో ఊరేగించారు. వేల్పుమడుగు, కరకముక్కల, మాళాపురం, విడపనకల్లు, ఆర్.కొట్టాల, పెద్ద కొట్టాలపల్లి, వి.కొత్తకోట, గడేకల్లు, జనార్దనపల్లి గ్రామాల నుంచే కాక ఉరవకొండ, కూడేరు, అనంతపురం, కర్నూలు జిల్లా, కర్ణాటకలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు తరలిరావడంతో విడపనకల్లు జనసంద్రమైంది.ఈ సందర్భంగా వీరగాసే, నందికోళ్ల ప్రదర్శన, కోలాటాలతో కళాకారులు అలరించారు. అనంతరం గ్రామ చివర ఉన్న పురాతన బావిలో కడ్లే గౌరమ్మను గంగ ఒడిలోకి చేర్చారు.

హావళిగిలో నేడు నిమజ్జనం

హావళిగిలో కడ్లే గౌరమ్మదేవి వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి. ఆడపడుచులు చక్కెర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శుక్రవారం అమ్మవారి నిమజ్జనం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.



అమ్మవారి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే

విడపనకల్లులో నిర్వహించిన కడ్లే గౌరమ్మదేవి రథోత్సవంలో ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి పాల్గొన్నారు. పూజలు నిర్వహించి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు గోపాలకృష్ణ, కరణం భీంరెడ్డి, దేశాయ్ చంద్రనాథ్, సిద్దార్థ, ఉమాశంకర్, హంపయ్య, లతీఫ్, ఎంపీటీసీ తిమ్మరాజు, నాగరాజు, పెద్దన్న, శ్రీరాములు, హనుమంతుయాదవ్ ఉన్నారు.

జిల్లాకు చేరిన 'ఎన్ఎంఎంఎస్' ప్రశ్నపత్రాలు

అనంతపురం ఎడ్యుకేషన్: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రాలు గురువారం జిల్లాకు చేరాయి. ఈనెల 3న పరీక్ష జరగనుంది. అనంతపురం డీఈఓ కార్యాలయం (పాత ఆఫీస్)లో వీటిని భద్రపరిచారు. జిల్లా విద్యాశాఖ అధికారి వి.నాగరాజు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ పరిశీలించారు. ప్రశ్నపత్రాలను శుక్రవారం పరీక్ష కేంద్రాలకు తరలించనున్నారు. జిల్లాలో మొత్తం 13 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇవన్నీ రెవెన్యూ డివిజన్ కేంద్రాలైన అనంతపురం, కళ్యాణదుర్గం, గుంతకల్లులోనే ఉన్నాయి. ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు మొత్తం 2,886 పరీక్షలకు హాజరుకానున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష జరుగుతుంది. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని డీఈఓ నాగరాజు ఆదేశించారు. ఏ కేంద్రంలోనూ సమస్యలు తలెత్తకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

17న రైతు సంఘం జిల్లా మహాసభ



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు మల్లికార్జున

అనంతపురం అర్బన్: ఈ నెల 17, 18 తేదీల్లో రైతు సంఘం జిల్లా మహాసభలను నిర్వహించనున్నట్లు ఆ సంఘం వర్కింగ్ అధ్యక్షుడు మల్లికార్జున తెలిపారు. రైతులు పెద్దసంఖ్యలో పాల్గొనేలా చేసి, సభల జయప్రదానికి కృషి చేయాలని నాయకులకు పిలుపునిచ్చారు. గురువారం అనంతపురంలోని ఆ సంఘం కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షుడు గోపాల్ అధ్యక్షతన జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో వ్యవసాయం అభివృద్ధి చెందితే రైతులు సంతోషంగా ఉంటారన్నారు. ఆ దిశగా ప్రభుత్వాలు రైతులకు అండగా నిలవాలన్నారు. రైతుల సమస్యల సాధనకు రైతు సంఘం అనునిత్యం పోరాటం చేస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతు సంఘాన్ని బలోపేతం చేసేందుకు 2024 జనవరి 4, 5 తేదీల్లో రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నప్ప, నాయకులు వన్నారెడ్డి, నరసింహులు, మనోహర్, రాము, మధుయాదవ్, వెంకటరాముడు, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ



చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

కూడేరు: ఐదు నెలల క్రితం బ్రెయిన్‌స్ట్రోక్‌తో మృతి చెందిన కూడేరు మండలం ముద్దలాపురానికి చెందిన మండ్లి రమేష్ యాదవ్ కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచింది. సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2.75లక్షలను చెక్కు రూపంలో గురువారం ఉదయం రమేష్ భార్య సావిత్రికి ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీపీ వీరన్న, సర్పంచ్ ధనుంజయ యాదవ్, ముద్దలాపురానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

నియంత్రణలో హెచ్‌ఐవీ

- హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నియంత్రణకు పటిష్ట చర్యలు
- ఉమ్మడి అనంతపురం జిల్లాలో 15,406 కేసులు
- హెచ్‌ఐవీ అదుపులో ఉన్న వారి సంఖ్య 12 వేలు
- గతేడాది 1,001 కొత్త కేసులు
- ఈ ఏడాది ఇప్పటి వరకూ 628 కేసులు నమోదు

సందర్భం : నేడు ప్రపంచ ఎయిడ్స్ నియంత్రణ దినం



అనంతపురం మెడికల్: ఉమ్మడి జిల్లాలో హెచ్‌ఐవీ మహమ్మారి నియంత్రణ దిశలో ఉంది. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నియంత్రణకు వైద్య ఆరోగ్యశాఖాధికారులు పటిష్ట చర్యలు చేపట్టడమే ఇందుకు కారణం. గతేడాది 1,001 కొత్త కేసులు నమోదు కాగా, ఈ ఏడాది అక్టోబర్ నాటికి 628 కేసులను అధికారులు గుర్తించారు.

ఏఆర్‌టీ సెంటర్ల మందుల పంపిణీ

ఉమ్మడి జిల్లాలో 2002 ఏప్రిల్ నుంచి ఈ ఏడాది అక్టోబర్ వరకూ 34,513 మందికి హెచ్‌ఐవీ సోకినట్లు అధికారిక సమాచారం. కాగా, యాంటీ రిట్రో వైరల్ చికిత్స (ఏఆర్‌టీ) కేంద్రాల్లో 27,289 మంది పేర్లు నమోదు చేసుకుని క్రమం తప్పకుండా మందులు వాడారు. ప్రస్తుతం జిల్లాలో హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌తో బాధపడుతున్న 15,406 మందికి ఉచితంగా మందులు అందజేస్తున్నారు. హెచ్‌ఐవీతో జీవించే వారికి మెరుగైన సేవలందించేందుకు ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (ఏపీ సాక్స్) అనంతపురంలోని జీజీహెచ్, పాతూరు సీడీ ఆస్పత్రి, నగరంలోని దీపు, చైతన్య ఆస్పత్రులు, గుంతకల్లు ఏరియా ఆస్పత్రి, గోపి ఆస్పత్రి, శ్రీసత్యసాయి జిల్లాలోని కదిరి, హిందూపురం, బత్తలపల్లి ఆర్డీటీ, పుట్టపర్తి ఆస్పత్రులెల్ల రక్తనిధి కేంద్రాలను ఏర్పాటు చేసింది. హెచ్‌ఐవీ రోగులకు పరీక్షలు చేయడంతో పాటు కౌన్సిలింగ్ ఇచ్చేందుకు జిల్లాలో 22 సమీకృత సలహా, పరీక్ష కేంద్రాలు(ఐసీటీసీ సెంటర్)లున్నాయి. సుఖ వ్యాధులతో బాధపడేవారి కోసం మెరుగైన వైద్యం అందించడానికి ప్రభుత్వ సర్వజనాస్పత్రి, గుంతకల్లు, కదిరి ఏరియా, హిందూపురం జిల్లా ఆస్పత్రిలో ప్రత్యేకంగా సుఖ వ్యాధుల చికిత్సా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో హెచ్‌ఐవీ గణాంకాలు

ఏడాది	హెచ్‌ఐవీ పరీక్షలు	బాధితులు
2019-20	2,03,852	1,207
2020-21	1,18,717	688
2021-22	2,01,349	848
2022-23	2,60,224	1,001
2023-24	1,32,883	628

నేడు అవగాహన ర్యాలీ

ప్రపంచ ఎయిడ్స్ నియంత్రణ దినాన్ని పురస్కరించుకుని ఈ నెల 1న ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అనంతపురంలో ఎయిడ్స్ పై ప్రజలను చైతన్య పరుస్తూ భారీ ర్యాలీని ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల నుంచి సప్తగిరి సర్కిల్ వరకూ ర్యాలీ కొనసాగుతుంది.

సామాజిక స్పృహ తప్పనిసరి



సామాజిక స్పృహతోనే హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌ను నియంత్రించవచ్చునని వైద్యులు అంటున్నారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని శృంగారం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా జీవితాంతం మందులు వాడుకుని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ముఖ్యంగా యువత ముందుచూపుతో వ్యవహరించాలని హెచ్చరిస్తున్నారు.

తగ్గుముఖం



జిల్లాలో గతేడాదితో పోల్చుకుంటే హెచ్‌ఐవీ, ఎయిడ్స్ బాధితుల సంఖ్య చాలా తగ్గింది. హెచ్‌ఐవీ నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకున్నాం. ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలోని విస్తృత అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం.

– డాక్టర్ భ్రమరాంబదేవి, డీఎంహెచ్‌ఓ

గుర్తు తెలియని యువకుడి హత్య

- శింగనమల మరువకొమ్మ క్రాస్ బస్ షెల్టర్‌లో యువకుడి మృతదేహం

శింగనమల: మండలంలోని అనంతపురం–తాడిపత్రి ప్రధాన రోడ్డుపై శింగనమల మరువకొమ్మ క్రాస్ వద్ద ఉన్న బస్ షెల్టరులో ఓ గుర్తు తెలియని యువకుడు (30) హత్యకు గురయ్యాడు. గురువారం తెల్లవారుజామున అటుగా వెళ్లిన స్థానికులు గుర్తించి, సమాచారం అందించడంతో సీఐ అస్రార్‌బాషా అక్కడకు చేరుకుని పరిశీలించారు. యువకుడి తలపై రాయితో బాది హతమార్చినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. రక్తం మడుగులో పడి ఉన్న యువకుడి మృతదేహం వద్ద ఉన్న బ్యాగ్‌ను పరిశీలించారు. అందులో దుస్తులు తప్ప ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. బస్ షెల్టర్‌కు సమీపంలో ఉన్న దుకాణాల నిర్వాహకులు, చేపల విక్రేతలను పోలీసులు విచారణ చేశారు. అయితే బుధవారం సాయంత్రం ఆ ప్రాంతంలో ఆ యువకుడు సంచరించినట్లు వెల్లడైంది. రాత్రికి బస్ షెల్టర్‌లో పడుకుని ఉన్నప్పుడు గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి ఉంటారని భావించారు. కాగా, బస్ షెల్టర్ సమీపంలో ఉన్న రెండు సీసీ కెమెరాల పుటేజీలను పోలీసులు పరిశీలించారు. అర్ధరాత్రి బస్ షెల్టర్‌లోకి ఓ వృద్ధుడు వెళ్లినట్లుగా అందులో దృశ్యాలు నిక్షిప్తమై ఉండడంతో అతనే హతమార్చి ఉంటాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



యువకుడి మృతదేహం



అర్ధరాత్రి బస్ షెల్టర్‌లోకి వెళుతున్న అనుమానిత వ్యక్తి

ఆన్‌లైన్ కొనుగోళ్లపై జాగ్రత్త అవసరం



మాట్లాడుతున్న వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంస్థ ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: వస్తు నకిలీ, అనుకరణలు, కల్తీ, ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంస్థ అధ్యక్షుడు వై.మోహన్ సూచించారు. సంస్థ ఆధ్వర్యంలో గురువారం అనంతపురంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో సంస్థ ప్రతినిధులు మోహన్, కేఎం అసదుల్లా మాట్లాడారు. వస్తు కొనుగోలులో వినియోగదారుడు మోసపోయినా, నష్టపోయినా పరిహారం రాబట్టుకునే అంశంపై విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలన్నారు. న్యాయవాది అవసరం లేకుండానే వ్యక్తిగతంగా లేదా, ఆన్‌లైన్‌లో గానీ కోర్టును ఆశ్రయించే విధానాన్ని వివరించారు. అనంతరం పేస్ పాఠశాలలో సాయంత్రం విద్యార్థుల సందేహాలకు నివృత్తి చేశారు. కార్యక్రమంలో ప్రశాంత్, హరి, ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

420 రాజకీయాలకు కేరాఫ్ బాబు



మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

తాడిపత్రి అర్బన్: రాష్ట్రంలో 420 రాజకీయాలకు చంద్రబాబు, లోకేష్ చిరునామాగా మారారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య ధ్వజమెత్తారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ చంద్రబాబు, నారా లోకేష్, టీడీపీ నేతలు మరోసారి ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమయ్యారని మండిపడ్డారు. గురువారం తాడిపత్రిలోని తన నివాసంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బూటకపు హామీలకు, అబద్ధాలకు నారా లోకేష్, చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్లుగా మారారన్నారు. 2014లో ఎన్నికల సమయంలో దాదాపు 600లకు పైగా హామీలను టీడీపీ మేనిఫెస్టోలో పేర్కొని గద్దెనెక్కిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఆ హామీలను తుంగలో తొక్కడమే కాక, ఏకంగా మేనిఫెస్టోనే మాయం చేశారని గుర్తు చేశారు. ఓ వైపు రాష్ట్ర ప్రజలు నిన్ను నమ్మం బాబు...మా నమ్మకం జగనే అంటున్నా.. దత్తపుత్రుడు, పుత్రుడితో కలసి ప్రజలను మభ్య పెట్టేలా అలవికాని హామీలతో ప్రజలకు ముందుకు వచ్చేందుకు చంద్రబాబు సిద్ధమవుతున్నారన్నారు. బాబు షూరిటీ...భవిష్యత్తు గ్యారెంటీ పేరుతో సరికొత్త నాటకానికి తెరతీశారని మండిపడ్డారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 99 శాతం హామీలను నెరవేర్చి దేశ రాజకీయాల్లో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనన్నారు. ఇటీవల నిర్వహించిన సమావేశాల్లో నారా లోకేష్ ప్రసంగిస్తూ అధికారులను బ్లాక్‌మెయిల్ చేస్తూ బెదిరింపులకు దిగడం సిగ్గుచేటన్నారు. ఇదంతా చూస్తుంటే లోకేష్ మానసిక పరిస్థితి బాగోలేదని తెలుస్తోందన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసిన రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనాన్ని అడ్డుకోలేరన్నారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్‌తో చోరీల నియంత్రణ : ఎస్పీ

అనంతపురం క్రైం: పోలీసు శాఖ అందుబాటులోకి తీసుకువచ్చిన లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్)తో చోరీల నియంత్రణ సాధ్యమని ఎస్పీ అన్బురాజన్ స్పష్టం చేశారు. వ్యక్తిగత పనులపై ఇళ్లకు తాళం వేసి మరో ప్రాంతానికి వెళ్లేవారు ఈ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. దొంగతనాల నియంత్రణలో భాగంగా ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వివరించారు. ఈ సేవలను వినియోగించుకునేందుకు ముందుగా మొబైల్‌లోని గూగుల్ ప్లే స్టోర్ నుంచి లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ డౌన్‌లోడ్ చేసుకుని ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు. అందులో పేరు, వివరాలు నమోదు చేసి లాగిన్ కాగానే వచ్చిన ఓటీపీ నంబర్‌ను ఎంటర్ చేయడంతో ద్వారా యూనిక్ ఐడీని పొందవచ్చునన్నారు. ఈ ఐడీ ఆధారంగా ఎప్పుడైనా ఇళ్లకు తాళం వేసి ఊళ్లకు వెళ్లే సమయంలో రిక్వెస్ట్ పోలీసు వాచ్‌ను ఎంపిక చేసుకుంటే పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఐపీ బేస్డ్ కెమెరాలను అమరుస్తామన్నారు. ఆ తర్వాత తాళం వేసిన ఆ ఇంట్లో ఎలాంటి కదలికలున్నా వెంటనే వైఫై కెమెరా ద్వారా కమాండ్ కంట్రోల్‌లో సైరన్ మోగుతుందన్నారు. తద్వారా పోలీసులు ఆ ఇంటికి చేరుకుని దొంగలను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకునే వీలుంటుందన్నారు. ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీజ్ చేసిన మద్యం ధ్వంసం

అనంతపురం క్రైం: ఎక్సైజ్ పరిధిలోని వివిధ కేసుల్లో పట్టుబడిన వద్ద రూ.3.50 లక్షలు విలువ చేసే కర్ణాటక మద్యం, సారాను సెబ్ పోలీసులు గురువారం సాయంత్రం ధ్వంసం చేశారు. టీవీ టవర్ వద్ద చేపట్టిన ఈ ప్రక్రియను సెబ్ అదనపు ఎస్పీ రామకృష్ణ పరిశీలించారు. కార్యక్రమంలో బుక్కరాయసముద్రం ఎస్ఐ మునిస్వామి, అనంతపురం సీఐ రవిచంద్ర పాల్గొన్నారు.

ఎస్కేయూలో కనకదాస జయంతి



ఎంపీ గోరంట్ల మాధవ్‌ను అభినందిస్తున్న ఎస్కేయూ ఇన్‌చార్జి వీసీ చింతా సుధాకర్ (చిత్రంలో) రిజిస్ట్రార్ లక్ష్మయ్య, ప్రొఫెసర్ రాంగోపాల్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో శ్రీభక్త కనకదాసు జయంతిని గురువారం అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన ఎంపీ గోరంట్ల మాధవ్ మాట్లాడుతూ.. సమాజంలోని మానసిక రుగ్మతలను రూపుమాపేందుకు భక్త కనకదాసు చేసిన కృషిని కొనియాడారు. ఇన్‌చార్జ్ వీసీ డాక్టర్ చింతా సుధాకర్ మాట్లాడుతూ.. కనకదాసు జీవితం అందరికీ మార్గదర్శకమన్నారు. ఎస్కేయూలోనూ భక్త కనకదాసు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య మాట్లాడుతూ.. కుల వ్యవస్థపై తిరుగుబాటు చేసిన కనకదాసు జీవితం ప్రతి ఒక్కరికీ అనుసరణీయమన్నారు. రచయిత బాలగొండ ఆంజనేయులు, ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ కె.రాంగోపాల్ పాల్గొన్నారు.

పిచ్చోడి చేతిలో కర్ర.. ధ్వంసమైన కార్ల అద్దాలు

యాడికి: మతిస్థిమితం లేని వ్యక్తి స్వైర విహారం చేయడంతో ఏకంగా ఐదు కార్ల అద్దాలు ధ్వంసమయ్యాయి. వివరాలను ఎస్ఐ గురుప్రసాదరెడ్డి వెల్లడించారు. యాడికిలోని ఆస్పత్రి కాలనీలో నివాసముంటున్న వైఎస్సార్‌సీపీ సోషియల్ మీడియా కన్వీనర్ ఫరూక్ ఇంటి వద్ద తన రెండు కార్లతో పాటు బాబ్జీ, శ్రీకాంత్‌కు చెందిన మరో రెండు కార్లు పార్కింగ్ చేశారు. అదే కాలనీలో నివాసముంటున్న బాలు కూడా తన ఇంటి వద్దనే కారు పార్కింగ్ చేశాడు. గురువారం తెల్లవారుజామున అదే కాలనీలో నివాసముంటున్న నారాయణస్వామి కట్టెతో అటుగా వెళుతూ కార్ల అద్దాలు ధ్వంసం చేసి, అందులో ఉన్న ధ్రువీకరణ పత్రాలను తీసుకెళ్లి, ఇంట్లో భద్రపరుచుకున్నాడు. ఉదయం ఈ విషయాన్ని తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు యాడికి ఉప సర్పంచ్ కాసా చంద్రమోహన్, ఎంపీటీసీలు వెంకటనాయుడు, నాగరాజు, రామ్మోహన్, పోలీసులు ఫరూక్ ఇంటి వద్దకు చేరుకుని ధ్వంసమైన కార్లను పరిశీలించారు. బాలు ఇంటి వద్ద ఉన్న సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా నారాయణస్వామిని గుర్తించి, అదుపులోకి తీసుకుని రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. కాగా, నారాయణస్వామికు మతిస్థిమితం లేదని కుటుంబసభ్యులు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

బాధిత మహిళకు ఎస్పీ అండ

అనంతపురం క్రైం: భర్తపై న్యాయ పోరాటం చేస్తున్న వివాహితకు ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ అండగా నిలిచారు. మూడ్రోజుల క్రితం తనకు న్యాయం చేయాలని కోరుతూ ఇద్దరు పిల్లలతో కలసి వివాహిత నీలిమ అనంతపురం రూరల్ పోలీసులను ఆశ్రయించిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న ఎస్పీ తక్షణమే స్పందించారు. దిశ పోలీసు స్టేషన్లో కేసు నమోదుకు సిఫారసు చేయడంతో పాటు తదుపరి న్యాయం కోసం డీఎల్ఎస్ఏ (జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ)కు పంపారు. దీంతో నీలిమకు న్యాయ సేవలు అందించేందుకు ప్రత్యేక న్యాయవాదిని నియమిస్తూ డీఎల్ఎస్ఏ ఆదేశించింది. ఈ నేపథ్యంలో నీలిమ, ఆమె ఇద్దరు పిల్లలను స్థానిక శాంతినగర్‌లో ఉన్న స్పందన స్వచ్ఛంద సంస్థలో ఆశ్రయం కల్పించారు. పిల్లల చదువులు కూడా అక్కడే నిర్వహించేలా ఏర్పాటు చేయించారు. కాగా, గతంలో అనంతపురం రూరల్ పోలీసు స్టేషన్లో నీలిమ ఫిర్యాదు మేరకు నమోదై, మూసేసిన ఐపీసీ 307, 498(ఎ) సెక్షన్లు కలిగిన కేసును రీ ఓపెన్ చేసి విచారణ చేపట్టాలని దిశ పోలీసులను ఎస్పీ ఆదేశించారు.

'వందేభారత్'పై దాడి కేసులో నిందితుడి అరెస్ట్

అనంతపురం సిటీ: యశ్వంత్‌పూర్–కాచిగూడ మధ్య తిరిగే వందేభారత్ రైలుపై రాళ్ల దాడికి పాల్పడిన కేసులో కీలక నిందితుడిని రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను అనంతపురం ఆర్‌పీఎఫ్ సీఐ రవిప్రకాష్ గురువారం వెల్లడించారు. బెంగళూరు నుంచి కాచిగూడకు అక్టోబర్ 17న బయలదేరిన వందేభారత్ రైలుపై అనంతపురం శివారులోని నేషనల్ పార్క్ వద్ద రెండోసారి రాళ్ల దాడి జరిగింది. ఘటనపై జాయింట్ ఆపరేషన్ చేపట్టిన ఆర్‌పీఎఫ్, జీఆర్పీ అధికారులు... రైలుకు అమర్చిన సీసీ కెమెరాలకు సంబంధించిన పుటేజీలను తెప్పించి, పరిశీలించారు. అనంతపురం లక్ష్మీనగర్‌కు చెందిన నీలూరు హేమంత్ కీలక నిందితుడిగా గుర్తించి, గురువారం అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపరిచారు. పరారీలో ఉన్న మరికొందరి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

జనవాక్కు

జీవనోపాధి మెరుగుపడింది



మా నాన్న జిలాన్ వెల్డింగ్ పనులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. నేను డిగ్రీ వరకూ చదువుకున్నా. ఉద్యోగ ప్రయత్నాల్లో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుని ఎడమ చెయ్యి విరిగింది. విషయం తెలుసుకున్న ఆరోగ్యమిత్ర బాబు మా ఇంటి వద్దకు వచ్చి వివరాలు తెలుసుకుని 2020లో అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి శస్త్రచికిత్స చేయించారు. నయాపైసా ఖర్చు లేకుండా నాకు నయమయ్యేలా చేసిన సీఎం వైఎస్ జగన్ సేవలను మరిచిపోలేను. ప్రస్తుతం వెల్డింగ్ పనులతో జీవనోపాధిని మెరుగుపరుచుకున్నా. ఇంటి వద్దనే స్వయం ఉపాధి పొందుతున్నా.

– ఎస్.గౌస్‌మొయిద్దీన్, పామిడి

ఆర్థిక ఇబ్బందులు తీరాయి



నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం అలేబాదు గ్రామంలో మా ఆయన పేరిట రెండు ఎకరాల పొలం ఉండేది. పంటలు సరిగ్గా పండక 15 సంవత్సరాల క్రితం యాడికి గ్రామానికి వలస వచ్చాం. మగ్గం పని నేర్చుకున్నాం. వచ్చే అరకొర ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకోవడం భారంగా మారింది. జగనన్న ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత నేతన్న నేస్తం పథకం కింద రూ.24వేలు ఆర్థిక సాయం అందుతోంది. మా పొలాన్ని కౌలుకు ఇవ్వడంతో ఏటా రూ.10వేలు వస్తోంది. ఏటా రూ.13,500 చొప్పున రైతు భరోసా లబ్ధి చేకూరుతోంది. ఈ మొత్తం డబ్బును మా ఆయన పెట్టుబడి పెట్టి చీరల వ్యాపారం మొదలు పెట్టారు. అమ్మ ఒడి పథకంతో మా రెండో కుమారుడిని విజయవాడలో ఇంటర్ చదివిస్తున్నాం. పెద్ద కుమారుడికి దీవెన పథకాల లబ్ధి చేకూరింది. దీంతో కర్నూలులో డిప్లొమా 3వ సంవత్సరం చదువుతున్నాడు. ఇప్పుడు మా కుటుంబానికి ఎలాంటి సమస్యలూ లేవు. ఆర్థిక ఇబ్బందులూ తీరాయి.

– లక్ష్మీదేవి, ఆస్పత్రి కాలనీ, యాడికి

లక్షాధికారిని చేశారు



ఇళ్లలో పనులు చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్న మాకు సొంతిల్లు కూడా లేదు. ఇంటి అద్దెలో కట్టలేక సతమతమయ్యేవాళ్లం. కొడుకు ఆటో నడపడం ద్వారా వచ్చే సంపాదనతో ఏ పూటకాపూట గడిచిపోయేది. సీఎంగా వైఎస్ జగన్ బాధ్యతలు తీసుకున్న తర్వాత మా బతుకులు బాగుపడ్డాయి. గార్లదిన్నె రైల్వే స్టేషన్ ప్రక్కన నా పేరుతో స్థలం మంజూరు చేసి, ఇల్లు కూడా కట్టించారు. ఇప్పుడా ఇల్లు రూ.లక్షల విలువ చేస్తోంది. నన్ను లక్షాధికారిని చేశారు. ఆర్థిక ఇబ్బందులు తీరాయి. సీఎం వైఎస్ జగన్‌కు మేమెంతో రుణపడి ఉన్నాం.

– ప్రమీల, గార్లదిన్నె

పేదరికం దూరమవుతోంది



నా భర్త శ్రీనివాసులు గ్యాస్ సిలిండర్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. జగనన్న ప్రభుత్వం అమలు చేసిన అమ్మఒడి, దీవెన పథకాల ద్వారా మా ఇద్దరు పిల్లలు కళ్యాణి, కిశోర్ ఉచితంగా ఉన్నత చదువులు అభ్యసిస్తున్నారు. మా కుమార్తె ఇంటర్ చదివేటప్పుడు రెండేళ్లు అమ్మ ఒడి, డిగ్రీ చేరాక జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాల ద్వారా లబ్ధిచేకూరింది. మా బాబు కూడా ప్రస్తుతం బీటెక్ చేస్తున్నాడు. ఈ పథకాల ద్వారా దాదాపు రూ.90 వేల వరకూ లబ్ధి పొందాం. జగనన్న సాయమందించకపోతే పిల్లల చదువులు భారమయ్యేవి. అప్పుల పాలయ్యేవాళ్లం. జగనన్న చేదోడు పథకం ద్వారా ఏటా రూ.10 వేల చొప్పున నాలుగుసార్లు లబ్ధి పొందాను. వైఎస్సార్ చేయూత ద్వారా రూ.18,750 చొప్పున మూడుసార్లు లబ్ధి చేకూరింది. నిజం చెప్పాలంటే జగనన్న పెట్టిన సంక్షేమ పథకాలతో మా పేదరికం దూరమవుతోంది.

– సి.పార్వతి, గంగానగర్, గుంతకల్లు

హత్యకేసులో నిందితులకు రిమాండ్

యల్లనూరు: మండలంలోని మేడికుర్తి సమీపంలో పొలం గట్టు వ్యవహారంలో రైతు నాగార్జున హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితులుగా ఉన్న నిట్టూరుకు చెందిన రైతు వెంకటరెడ్డి, శంకుతల, పెద్దిరెడ్డిని గిర్రమ్మబావి సాయిబాబా దేవాలయం వద్ద పోలీసులు అదుపులోకి తీసుకుని న్యాయమూర్తి ఆదేశాల మేరకు గురువారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

లారీ ఢీకొని డ్రైవర్ మృతి

- క్లీనర్‌కు తీవ్ర గాయాలు

గుత్తి రూరల్: జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ డ్రైవర్ దుర్మరణం పాలయ్యాడు. క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని బళ్లారికి చెందిన ప్రసాద్, మల్లికార్జున లారీ డ్రైవర్, క్లీనర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవారు. ఈ క్రమంలో నెల్లూరు నుంచి బొగ్గు లోడుతో బళ్లారికి బయలుదేరిన వారు... గురువారం వేకువజామున గుత్తి మండలం కొజ్జేపల్లి – రజాపురం గ్రామాల మధ్య 67వ జాతీయ రహదారిపై చేరుకోగానే బొగ్గుకు కప్పిన టార్పాలిన్ జారిపోయింది. దీంతో లారీని రోడ్డు పక్కన ఆపి టార్పాలిన్‌ను సరిచేసుకుంటున్న సమయంలో గుంతకల్లు వైపు వెళుతున్న లారీ వెనుక నుంచి ఇద్దరినీ ఢీకొంది. ఘటనలో డ్రైవర్ ప్రసాద్ (48) తల ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ లారీని ఆపకుండా వెళుతుండడంతో స్థానికులు వెంబడించి గుంతకల్లు మండలం గొల్లలదొడ్డి వద్ద అడ్డుకున్నారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన మల్లికార్జునను 108 అంబులెన్స్ ద్వారా గుత్తి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, వాహనాన్ని సీజ్ చేసినట్లు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



డీఎంహెచ్‌ఓ భ్రమరాంబ దేవికి పుష్పగుచ్ఛం అందిస్తున్న డాక్టర్ రవిశంకర్

అనంతపురం మెడికల్: నేషనల్ హెల్త్ మిషన్ జిల్లా ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ అధికారిగా డాక్టర్ ఎం.రవిశంకర్ గురువారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు. ముందుగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబ దేవిని రవిశంకర్ మర్యాదపూర్వకంగా కలిశారు.

ప్రజలకు అందుబాటులో ఉంటాం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ జనార్దన్

ఆత్మకూరు: మండలంలోని ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటామని ఎస్‌ఐ జనార్దన్ తెలిపారు. గురువారం మండలంలోని తలుపూరు, వడ్డుపల్లి గ్రామాల్లో సిబ్బందితో కలసి పర్యటించి గ్రామ సభలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఎలాంటి సమస్యలు వచ్చినా, ప్రమాదాలు జరిగినా వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఎయిడ్స్ నివారణపై ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం మెడికల్: ప్రపంచ ఎయిడ్స్ దినాన్ని పురస్కరించుకుని డాక్టర్ కేఎస్ఏఆర్ గఫూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ విద్యార్థులు గురువారం నగరంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. హెచ్‌ఐవీ/ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొట్టాలని నినాదాలు చేశారు. ఇన్‌స్టిట్యూట్ అధినేత డాక్టర్ అబ్దుల్ రజాక్ మాట్లాడుతూ హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో గఫూర్ ఆస్పత్రి మేనేజర్ జిలాన్‌రాజా, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమాజాన్ని చైతన్యపరచాలి



సమావేశంలో పాల్గొన్న అధికారులు, ఎన్‌వైకే వలంటీర్లు

అనంతపురం కల్చరల్: సమాజాన్ని చైతన్యవంతం చేసి ముందుకు నడిపించే బాధ్యతను యువత తీసుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. గురువారం యువజన వ్యవహారాల శాఖ, నెహ్రూ యువకేంద్రం, ప్రగతి పథం సంయుక్త ఆధ్వర్యంలో ఎన్‌వైకే సమావేశమందిరంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన డాక్టర్ వెంకటరత్నం, అనంత నెట్‌వర్క్ ఆఫ్ పాజిటివ్ వీరాంజనేయులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు బిసాతి భరత్, జీవన్‌కుమార్, బ్యాంక్ డైరెక్టర్ రమేష్ మాట్లాడారు. క్విజ్, వక్తృత్వ పోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రశంసా పత్రాలనందుకున్నారు.


సాంకేతిక పరిజ్ఞానంతోనే పురోగతి



డెవాప్స్‌పై పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

రాప్తాడు: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతోనే పురోగతి సాధ్యమని ఎస్‌వీఐటీ కళాశాల కళాశాల కరస్పాండెంట్ వీ.బీ.ఆర్.శర్మ విద్యార్థులకు సూచించారు. ఎస్‌వీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం డెవాప్స్ అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు కళాశాల కరస్పాండెంట్ వీ.బీ.ఆర్.శర్మ మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ క్రిష్టారెడ్డి, వైస్ చైర్మన్ వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎండీ వెన్నపూస రమాకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ టి.సూర్యశేఖర్‌రెడ్డి, సీఈఓ ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆదాబ్ సాబ్



అనంతపురం కార్పొరేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహ్మద్ గురువారం కడపలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. కడప పెద్దదర్గా ఉరుసు ఉత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చిన సీఎంను దర్గా ఆవరణలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

చంద్రబాబుది నయవంచక పాలన

అనంతపురం కార్పొరేషన్: చంద్రబాబు నయవంచక పాలనతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని మేయర్ వసీం విమర్శించారు. గురువారం నగరంలో 26వ సచివాలయ పరిధిలోని గుల్జార్‌పేట, 23వ సచివాలయం కమలానగర్, 43వ సచివాలయం న్యూ రెవెన్యూ కాలనీ, 54 సచివాలయ పరిధి రామ్‌నగర్‌లో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం జరిగింది. గుల్జార్‌పేటలో జరిగిన కార్యక్రమంలో మేయర్ వసీం పాల్గొని, సంక్షేమ, అభివృద్ధి బోర్డును ఆవిష్కరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2014 ఎన్నికలకు ముందు టీడీపీ అధినేత చంద్రబాబు 600 హామీలను ప్రకటించి, అధికారంలోకి వచ్చాక మేనిఫెస్టోనే కనిపించకుండా చేసి ప్రజలను నట్టేట ముంచారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 98 శాతం మేనిఫెస్టో అమలు చేశారన్నారు. ఇదే స్థాయిలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మరోమారు సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని చేసుకుందామని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు గూడూరు మల్లికార్జున, అనిల్ కుమార్ రెడ్డి, అబూసలేహా, సంపంగి రామాంజినేయులు, నాగవినీత, ముంతాజ్‌బేగం, వైస్సార్ సీపీ నేత చింతా సోమశేఖర్ రెడ్డి, క్లస్టర్ అధ్యక్షులు రమణారెడ్డి, ఓబిరెడ్డి, జగదీష్, మధు, జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు లక్ష్మన్న, చింతకుంట మధు, వీరా రామకృష్ణారెడ్డి, నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు, పార్టీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ ఖాజా, ఎంఎల్‌ఓ అమర్‌నాథ్ రెడ్డి, నాయకులు దాదు తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం, వాసంతిసాహిత్య

సీఎం జగన్ పేదల పక్షపాతి

అనంతపురం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ రూరల్ మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ హుస్సేన్ అన్నారు. గురువారం రుద్రంపేట పంచాయతీ పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరించారు. సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ అనంతపురం రూరల్ మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ హుస్సేన్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. అధికారంలో ఉన్న సమయంలో ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన చంద్రబాబుకు తమ ప్రభుత్వం గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మావతి, ఎంపీటీసీలు మహబూబీ, నారాయణమ్మ, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి సాదిక్‌వలి, వైఎస్సార్‌సీపీ నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగరాజునాయక్, ఉప్పర నవీన్, విజయ్ కుమార్, రామ్మూర్తి, వెంకటేష్ తదితరులున్నారు.

మంచిని వివరిద్దాం

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన మంచిని ప్రజల ఇళ్ల దగ్గరకు వెళ్లి తెలియజేద్దామని ఎంపీపీ హేమలత తెలిపారు. గురువారం మండలంలోని మదిగుబ్బలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయం వద్ద సంక్షేమ లబ్ధి బోర్డును ఆవిష్కరించారు. సంక్షేమం, అభివృద్ధిని చూసి మరోసారి ప్రజలందరూ సీఎం వైఎస్ జగన్‌ను ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ వడ్డుపల్లి నరసింహారెడ్డి, సర్పంచ్ నరసింహా, ఎంపీటీసీ లక్ష్మీదేవి, కన్వీనర్ లక్ష్మి నరసింహులు, యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి, మండల ఎలెక్షన్ ఇన్‌చార్జ్ సనప గోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ విజయ్ కుమార్ నాయక్, పంపనూరు సర్పంచ్ ఎర్రిస్వామి పాల్గొన్నారు.

కక్కలపల్లిలో..

రాప్తాడురూరల్: అన్ని వర్గాల సంక్షేమానికి బాటలు వేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవసరం రాష్ట్రానికి చాలా ఉందని అనంతపురం రూరల్ జెడ్పీటీసీ సభ్యుడు జూటూరు చంద్రకుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు ధనుంజయయాదవ్, మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ నాగేశ్వరరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ దుగుమర్రి గోవిందరెడ్డి, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి గ్రామంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాయంలో ప్రభుత్వ పథకాలకు సంబంధించిన బోర్డు, పార్టీ జెండా ఆవిష్కరించారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధిని తెలియజేస్తూ రాష్ట్రానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవసరాన్ని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గార్లదిన్నె కృష్ణయ్య, చియ్యేడు సర్పంచ్ గంగాధర్‌రెడ్డి, వైస్ సర్పంచ్ బండి రమేష్, ఎంపీటీసీ సభ్యులు పెన్నోబులేసు, మాజీ సర్పంచ్ కల్లుమడి శ్రీనివాసులు, బయప్ప, నరసింహారెడ్డి, ఉప్పరపల్లి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు: మండలంలోని హంపాపురంలో గురువారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేశారు. సంక్షేమ లబ్ధికి సంబంధించి డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, ఎన్నికల మండల ఇన్‌చార్జి చిట్రెడ్డి సత్యనారాయణరెడ్డి, సర్పంచు గోరవ లక్ష్మీదేవి, నాయకులు గోరవ వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు



సంక్షేమ లబ్ధి బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు



ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

'ఆడుదాం ఆంధ్రా'ను విజయవంతం చేద్దాం



విద్యార్థులు గీసిన చిత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాప్తాడు: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పీడీ, పీఈటీలు కృషి చేయాలని స్కూల్ కాంప్లెక్స్ అధ్యక్షుడు నరసింహులు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిట్ ఇండియా, ఆడుదాం ఆంధ్రపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు వైష్ణవి, అంజలి, హేమలత, పవిత్ర, ప్రియ లిఖిత తదితరులు ఫిట్ ఇండియా, ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాలపై గీసిన చిత్రాలను ఆవిష్కరించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

రాప్తాడురూరల్: అనారోగ్యం బారిన పడి వివిధ ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్య చికిత్సలు పొందిన రాప్తాడు నియోజవర్గ పరిధిలోని పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) చెక్కులను గురువారం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. రాప్తాడులో జరిగిన కార్యక్రమంలో మొత్తం 12 మందికి రూ. 11 లక్షల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.

ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి

అనంతపురం టవర్‌క్లాక్: ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి చేస్తానని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యులు ముడియం రమణ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం కర్నూలులో జరిగిన సమావేశంలో తనను రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. గతంలో వాసవీ సేవా సంఘం ఉపాధ్యక్షుడిగా, కార్యదర్శిగా సమర్థవంతంగా పనిచేసినందుకు మహాసభ కార్యవర్గ సభ్యుడిగా అవకాశం కల్పించారని వెల్లడించారు.

ఆడబిడ్డలకు సీఎం జగన్ అండ

అనంతపురం కార్పొరేషన్: అంబేడ్కర్ నగర్‌కు చెందిన పలువురికి కళ్యాణమస్తు కింద మంజూరైన రూ.2 లక్షల మొత్తాన్ని (చెరో రూ.లక్ష) ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తన నివాసంలో గురువారం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల కుటుంబాలకు చెందిన ఆడబిడ్డలకు అండగా నిలవాలని సీఎం జగన్ వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా పథకాలను తీసుకువచ్చారన్నారు. తమ కుటుంబానికి అండగా నిలిచినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సాకే చంద్రలేఖ, వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం నగర అధ్యక్షుడు సాకే కుళ్లాయి స్వామి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



లబ్ధిదారులతో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

స్నాతకోత్సవ సన్నాహ కమిటీల నియామకం

అనంతపురం: జనవరిలో నిర్వహించనున్న జేఎన్‌టీయూ అనంతపురం 13వ స్నాతకోత్సవ నిర్వహణకు సన్నాహ కమిటీలను నియమించారు. వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన అధ్యక్షతన గురువారం జరిగిన సమీక్ష సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా స్నాతకోత్సవాన్ని నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ ఎం. విజయకుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిధర్, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ. కేశవ రెడ్డి, డీఏపీ ప్రొఫెసర్ వి. సుమలత, డీఏఏ ప్రొఫెసర్ సురేష్‌బాబు, పాలకమండలి సభ్యులు ప్రొఫెసర్ బి. దుర్గాప్రసాద్, డాక్టర్ ఎం. రామశేఖర్ రెడ్డి, డిప్యూటీ రిజిస్ట్రార్ మధుసూధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నూతన ఫైనాన్స్ ఆఫీసర్‌ను అభినందిస్తున్న వీసీ జింకా రంగజనార్దన

- జేఎన్‌టీయూ (ఏ) నూతన ఫైనాన్స్ ఆఫీసర్‌గా మహమ్మద్ సిరాజుద్దీన్ నియమితులయ్యారు. గ్రూప్-1 అధికారిని ఫైనాన్స్ ఆఫీసర్‌గా నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. ఆయనను వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్ అభినందించారు.

జగనన్నతోనే సంక్షేమాభివృద్ధి

రామగిరి: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలాంటివని వాటిని రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఓ యజ్ఞంలా నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని పేరూరులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో వందల హామీలు ఇచ్చి అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని విమర్శించారు. సీఎం వైఎస్ జగన్ ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను కూడా నెరవేరుస్తున్నారని కొనియాడారు. పరిటాల కుటుంబం 30 ఏళ్లుగా పదవులను అనుభవిస్తున్నా ప్రజలకు చేసింది మాత్రం శూన్యమన్నారు. త్వరలో రామగిరి బంగారు గనులు తెరిపించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.

భక్త కనకదాసకు ఘన నివాళి

దుబ్బార్లపల్లిలో గురువారం కనకదాస జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి కనకదాస చిత్రపటానికి పూలమాల లేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ సభ్యులు గోసే నాగార్జున, గొని మారుతీ ప్రసాద్, ఆది, గొర్రెల, మేకల ఫెడరేషన్ చైర్మన్ నరసింహాగౌడ్, ముత్యాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ ముత్యాలప్ప, చిట్రా వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రాయితీని సద్వినియోగం చేసుకోండి

కనగానపల్లి: ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న గ్యాస్ రాయితీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రం కనగానపల్లి గురువారం శివరాం ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వహించిన ఉజ్వల ఉచిత వంట గ్యాస్ కనెక్షన్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తొలి విడతగా 550 మందికి ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు మంజూరైనట్లు ఏజెన్సీ నిర్వాహకులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మారుతీప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

సీఎం జగన్ రైతు పక్షపాతి

రామగిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి అని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని నసనకోట, దుబ్బార్లపల్లి, పేరూరులో రైతు భరోసా కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేకున్నప్పటికీ రైతులు ఇబ్బందులు పడకూడదనే ఆయా పంచాయతీ కేంద్రాల్లో రైతు భరోసా కేంద్రాలను నిర్మించారన్నారు. కర్షకులకు కావాల్సిన మందులు, వ్యవసాయ పరికరాలు తదితర వాటిని ఆర్బీకేల ద్వారా అందించే విధంగా చర్యలు చేపట్టినట్లు వివరించారు. గతంలో పాలకులు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని, అయితే నేడు గ్రామాల్లోనే విత్తనాలు దొరికే విధంగా చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మీనుగ నాగమ్మ, జెడ్పీటీసీ సభ్యులు నాగార్జున, మారుతీప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కర్రా హనుమంతరెడ్డి, సర్పంచులు మీనుగ నాగరాజు, రాజేష్, నరేంద్రలతో పాటు నాయకులు రమేష్, కురుబ ముత్యాలప్ప తదితరులు పాల్గొన్నారు.

సరైన వైద్యం అందలేదని ఆందోళన

అనంతపురం క్రైం: వైద్యం కోసం బాలున్ని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చగా మరిన్ని వ్యాధులకు గురయ్యాడని, ఇది వైద్యుల నిర్లక్ష్యమేనని ఆరోపిస్తూ బాధితుడు కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. ఈఘటన గురువారం అనంతపురంలోని కమలానగర్‌లో జరిగింది. వివరాలు...శ్రీసత్యసాయి జిల్లా, పెనుకొండ మండలం గుట్టూరు గ్రామానికి చెందిన వెంకటేష్, సాయిశ్వరీ దంపతుల కుమారుడైన పదేళ్ల బాలుడు ప్రవీణ్ 20 రోజుల క్రితం కళ్లు తిరిగి కింద పడిపోయాడు. దీంతో కమలానగరలోని శశి న్యూరో, స్కిన్ హాస్పిటల్‌కు తీసుకువచ్చారు. డాక్టర్ శశి వైద్య పరీక్షలు చేసి 20 రోజులకు సరిపడే మందులు ఇచ్చి పంపారు. అయితే బాలుడు కోలుకోక పోగా ఆరోగ్యం రోజురోజుకు క్షీణిస్తోంది. దీంతో తిరిగి హాస్పిటల్‌కు వచ్చారు. మహిళా వైద్యురాలు పరిశీలించి మరిన్ని మందులిచ్చింది. దీంతో బాలుడికి శరీరంపై మచ్చలు రావడంతో బెంగళూరు తీసుకెళ్లారు. అనంతపురంలో ఇచ్చిన మందుల కారణంగానే అలర్జీ వచ్చిందని అక్కడి వైద్యులు నిర్ధారించారు. 20 రోజులు అక్కడే వైద్యం అందించారు. చికిత్స కొనసాగించేందుకు చేతిలో చిల్లిగవ్వలేక బాలుడిని తీసుకుని సొంతూరుకు చేరుకున్నారు. పెద్దల సలహాతో శశిన్యూరో కేర్‌కు తెచ్చారు. రూ.4లక్షలు ఖర్చు చేసినా బాలుడి ఆరోగ్యం కుదుట పడలేదని, మీ నిర్లక్ష్యం వల్లనే బాలుడి ఆరోగ్యం క్షీణించిందని ఆరోపిస్తూ ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. యాజమాన్యం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మాట్లాడారు. బాలుడి పరిస్థితిని చూసి జిల్లా వైద్యాధికారి ఈ.బీ దేవికి సమాచారం ఇచ్చారు. ఆస్పత్రి యాజమాన్యంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని బాలుడి కుటుంబ సభ్యులు తెలిపారు.

తప్పిన ప్రమాదం

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రి రేడియాలజీ విభాగంలోని 29 నంబర్ ఎక్స్‌రే గదిలో సీలింగ్ రూఫ్ కింద పడింది. విద్యార్థినులు గదిలో తమ పుస్తకాలు, భోజనం, తినుబండారాలు ఉంచే వారు. అక్కడే భోజనాలు చేసేవారు. రూఫ్ కింద పడ్డ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

నేడు ఎమ్మెల్యే పర్యటన

రాప్తాడు: మండలంలో శుక్రవారం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పర్యటించనున్నట్లు ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మీ, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి తెలిపారు. ఉదయం 11 గంటలకు హంపాపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఉంటుందన్నారు. నూతన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ప్రారంభిస్తారన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు పుల్లలరేవులో జగనన్న ప్రజా సంక్షేమ సదస్సు, సాయంత్రం 5.30కు మరూరులో 'గడప గడపకూ మన ప్రభుత్వం' ఉంటుందన్నారు.

సంక్షిప్త సమాచారం

సనపలో స్టోరేజ్ షెడ్ నిర్మాణం

ఆత్మకూరు: మండలంలోని సనపలో రైతుల కోసం అగ్రికల్చర్ స్టోరేజ్ షెడ్లు నిర్మిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల ఎలక్షన్ ఇన్‌చార్జ్ సనప గోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం గ్రామంలో స్టోరేజ్ షెడ్లకు సంబంధించిన పనులను గ్రామస్తులతో కలసి పరిశీలించారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఏడీసీసీ బ్యాంక్ ద్వారా రూ.98 లక్షల వ్యయంతో నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు.

బాలుడి అదృశ్యం

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి పంచాయతీ బీజేపీ కాలనీకి చెందిన 15 ఏళ్ల బాలుడు అదృశ్యమయ్యాడు. కాలనీకి చెందిన భాస్కర్‌నాయక్, కవిత దంపతుల కుమారుడు విష్ణువర్ధన్‌నాయక్ నగరంలోని పొట్టిశ్రీరాములు నగరపాలక ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతూ మధ్యలో స్కూల్ మానేశాడు. వైరింగ్ పని కోసం వెళ్తుండేవాడు. తల్లిదండ్రులు మార్కెట్‌లో కూలి పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నారు. రోజూలా మూడు రోజుల క్రితం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన విష్ణువర్ధన్‌నాయక్ తిరిగి రాలేదు. తల్లిదండ్రులు తెలిసిన ప్రాంతాల్లో వెతికారు. ఆచూకీ లేకపోవడంతో రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలుడి ఆచూకీ తెలిస్తే సీఐ 94407 96811, ఎస్‌ఐ 91002 35433, బాలుడి తండ్రి 83339 52305 నంబర్లకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలి

అనంతపురం అర్బన్: అగ్రిగోల్డ్ కంపెనీ బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని అగ్రిగోల్డ్ కస్టమర్లు, ఏజెంట్ల సంక్షేమ సంఘం జిల్ల గౌరవాధ్యక్షుడు పి.నారాయణస్వామి, సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి సిద్దేశ్వర్ కోరారు. గురువారం స్థానిక సంఘం కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడారు. అగ్రిగోల్డ్ బాధితుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు డిసెంబరు 4 నుంచి 11వ తేదీ వరకు అన్ని నియోజకవర్గాల్లో సత్యాగ్రహ రిలే దీక్షలు చేపట్టనున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నారాయణప్ప, నాయకులు ధనుంజయ, శ్రీనివాసులు, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

దళితులపై వివక్ష చూపితే చర్యలు

రాప్తాడు: గ్రామాల్లో దళితులపై ఎవరైనా వివక్ష చూపితే చట్టప్రకారం చర్యలు తప్పవని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటశివారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని అయ్యవారిపల్లిలో ఎస్సీ కాలనీలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా ఎస్సీలపై వివక్ష చూపితే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మునివేలు, ఎస్‌ఐ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రెవరెండ్ ప్రభాకర్ మృతి తీరనిలోటు

అనంతపురం కల్చరల్: క్రైస్తవ లోకాన్ని చైతన్యపరచిన ప్రభాకర్ మరణం తీరని లోటని పాస్టర్ల సంఘం అధ్యక్షులు నెహమ్యా నాగరాజు, జీఆర్ ఆనంద్, పాస్టర్ మనుష్యే, రెవరెండ్ జీవన్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం సంఘంలో జరిగిన సంతాప సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభాకర్ దేశవ్యాప్తంగా పర్యటించి ఎంతో మంది దైవసేవకులను తయారు చేశారని గుర్తు చేసుకున్నారు. అనాథ శరణాలయాలు కట్టించారన్నారు.

భక్తిశ్రద్ధలతో అన్నాభిషేకం

అనంతపురం కల్చరల్: శివబాలయోగి ఆశ్రమంలో గురువారం అనంతేశ్వరుడికి అన్నాభిషేకం ఘనంగా జరిగింది. ఆలయ ప్రతినిధులు అరవింద్, రత్నగిరి దేవరాజ్ నేతృత్వంలో ఉదయం పంచామృత సహిత రుద్రాభిషేకం, మహా కుంకుమార్చన, మధ్యాహ్నం 12.30 గంటలకు భక్తుల చేతుల మీదుగా మహాశివుడికి అన్నాభిషేకం జరిగాయి.

కేంద్ర మంత్రికి తపాలా ఉద్యోగుల వినతి

అనంతపురం సిటీ: గోరంట్ల పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌ను ఉమ్మడి జిల్లాకు చెందిన తపాలా ఉద్యోగులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. తమ సమస్యలను వినతిపత్రం రూపంలో ఆమెకు అందించారు. మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసిన వారిలో ఆల్ ఇండియా గ్రామీణ డాక్‌సేవక్స్ యూనియన్ కార్యదర్శి కృష్ణయ్య, శ్రీరాములు, ప్రభాకర్, నరసింహ, రామచంద్ర తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో సంకష్టహర చతుర్థి

అనంతపురం కల్చరల్: సంకష్టహర చతుర్థి వేడుకలు గురువారం మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం, హెచ్చెల్సీ కాలనీలోని నసనకోట ముత్యాలమ్మ ఆలయంలో భక్తిశ్రద్ధలతో జరిగాయి. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి పూజల్లో పాల్గొన్నారు. రజక నగర్‌లో కొలువైన సంకష్టహర వినాయకుని ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. స్థానిక మూడవరోడ్డునందున్న శ్రీషిరిడి సాయిబాబా మందిరంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. 5 వ్రత కథలను అర్చకులు చదివి వినిపించారు.

ప్రత్యేక సమావేశం వాయిదా

అనంతపురం సిటీ: అనంతపురంలోని కార్మిక శాఖ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశం వాయిదా పడింది. శ్రీసత్యసాయి, శ్రీరామరెడ్డి తాగునీటి పథకాల విభాగాల్లో పని చేస్తున్న కార్మికులకు చెల్లించాల్సిన వేతన బకాయిలు, పీఎఫ్, ఈఎస్‌ఐ, బోనస్, గ్రాట్యూటీ చెల్లింపులకు సంబంధించిన అంశాలపై చర్చించేందుకు డీసీఎల్ లక్ష్మీనరసయ్య అధ్యక్షతన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.

సాక్షి ఫ్యామిలీ
అనంతపురం
శుక్రవారం ॥ 1-12-2023

ఫ్యాషన్





వివాహ వేడుకలలో కట్టే చీరలే దివ్యంగా వెలిగిపోతుంటాయి.
ఇక వాటికి అదనంగా మరో స్టయిల్‌ను కూడా జోడిస్తే..
ఆ వెలుగులు రెట్టింపు అవుతాయి.
పట్టు, వెల్వెట్, ఎంబ్రాయిడరీ దుపట్టా చీర మీదకు ధరించినా,
డ్రేపింగ్‌లో జత చేసినా ఆ స్టైల్ హుందాగా కనిపిస్తుంది.
ఈ వింటర్ సీజన్‌కి ప్రత్యేకంగా ఉండటమే కాదు చలి నుంచి రక్షణను కూడా ఇస్తుంది.
ఎవర్‌గ్రీన్‌గా ఉండే శారీ కట్టుకి
మహారాణి కళను తెచ్చే దుపట్టా స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తుంది.

డబుల్ అట్రాక్షన్





కాంట్రాస్ట్

శారీ కలర్, దుపట్టా కలరా పూర్తి కాంట్రాస్ట్ ఉన్నది ఎంచుకోవాలి. దీనివల్ల రెండూ భిన్నంగా, ఆకర్షణీయంగా కనిపిస్తాయి.

రంగు ఒకటే... డిజైన్ వేరు

సేమ్ కలర్ శారీ దుపట్టాను ఎంచుకున్నా ఎంబ్రాయిడరీ డిజైన్‌లో కాంబినేషన్స్ చూసుకోవాలి. చీర డిజైన్ హెవీగా ఉంటే, దుపట్టా డిజైన్ బ్రైట్‌గా ఉండేలా ప్లాన్ చేసుకోవాలి. పట్టు శారీ మీదకు డిజైనర్ దుపట్టాను ఎంచుకునేటప్పుడు ఈ జాగ్రత్తలు తీసుకోవాలి.







శాలువా స్టైల్

చీర మీదకు దుపట్టాను శాలువా మాదిరి కప్పుకున్నా ఈ సీజన్‌కి వెచ్చగా, బ్రైట్‌గా ఉంటుంది. అయితే, దుపట్టా గ్రాండ్‌గా ఉన్నది ఎంచుకోవాలి. ఇందుకు పట్టు, బ్రొకేడ్, ఎంబ్రాయిడరీ దుపట్టాలను చీరలను ఎంపికను బట్టి తీసుకోవాలి.

డ్రేపింగ్ దుపట్టా

చీరకట్టులో భాగంగా దుపట్టాను జత చేర్చి కట్టడం ఒక స్టైల్. ఈ కట్టును నిపుణుల ఆధ్వర్యంలో సెట్ చేయించుకోవాలి. ఈ కట్టుకు కూడా కాంట్రాస్ట్ కలర్స్ ఉండేలా చూసుకోవాలి.

* ధైర్యం

వ్యసనాల నుంచి వెలుగులోకి

పట్నాలో బ్యాంకు ఉద్యోగం చేస్తున్న రాఖీ శర్మ ఆ ఉద్యోగాన్ని వదిలేసి భర్త నడుపుతున్న రీహాబిలిటేషన్ సెంటర్‌ను తను స్వయంగా నిర్వహించడం మొదలుపెట్టింది. 5 వేల మంది ఇరవై ఏళ్ల లోపు పిల్లలను డ్రగ్స్ బారి నుంచి విముక్తి పొందేలా చేసింది. ఖైదీలలో మార్పు తీసుకురావడానికి కౌన్సెలింగ్స్ ఇస్తోంది. మహిళలు వ్యసనానికి ఎలా లోనవుతున్నారు, వారు ఆ వ్యసనాల నుంచి బయట పడటం ఎలా అనే అంశంపై పని చేస్తున్నాను' అని వివరిస్తోంది రాఖీ. వ్యసనాలకు గురైన వారు వాటినుంచి బయటపడి తిరిగి సంతోషకరమైన జీవనాన్ని పొందేందుకు ఆమె చేస్తున్న స్ఫూర్తిదాయక జీవన ప్రయాణం కీలక అంశాలు.

''ఒకరోజు అర్ధరాత్రి ఫోన్ కాల్ వచ్చింది. విషయం విని చాలా బాధ అనిపించింది. ఒక మహిళ బ్లేడ్‌తో ఒళ్లంతా కోసుకుంది. డ్రగ్స్ కారణంగా ఆమె వైవాహిక జీవితం దెబ్బతింది. మత్తు పదార్థాల నుంచి ఎలా బయటపడాలో ఆమెకు అర్థం కావడం లేదు. మహిళలు డీ–అడిక్షన్ సెంటర్లకు వెళ్లడం అనేది ఉందా.. అని నన్ను అడిగారు. మద్యపానం, డ్రగ్స్, గంజాయి వంటి వాటికి అలవాటు పడిన వ్యక్తులు తమ అలవాటును వదిలించుకోవడానికి సహాయం చేయడం కూడా ఒక ముఖ్యమైన పని. నా మౌనం–పని ఈ రెండింటితో ఈ సెంటర్‌ను 22 ఏళ్లుగా నడుపుతున్నాను. వేలాదిమందిని మాదకద్రవ్య వ్యసనం బారి నుంచి బయటికి తీసుకువచ్చాను. ఒకప్పుడు తమ జీవితాలు అంధకారంలో ఉండి, అన్ని వైపులా నిరాశకు గురైన వారు ఇప్పుడు వారి కుటుంబాలతో జీవిస్తున్నందుకు సంతోషపడుతున్నాను.



రాఖీ శర్మ

బ్యాంకు ఉద్యోగాన్ని వదిలేసి..

పుట్టి పెరిగింది గురుగ్రామ్. కొన్నాళ్లు ఢిల్లీలోనే ఉన్నాను. జంషెడ్‌పూర్, కోల్‌కతాలలో చదువుకున్నాను. డాక్టర్ కావాలనుకున్నాను కాని బ్యాంక్ ఉద్యోగి అయిన నాన్న కోరిక మేరకు సీఏ చదివాను. పెళ్లయ్యాక పట్నా వచ్చాను. నేనూ బ్యాంకు ఉద్యోగం సంపాదించుకున్నాను. కానీ కుటుంబాన్ని, ఉద్యోగాన్ని ఏకకాలంలో నిర్వహించడం అంత సులభం కాదని కొన్ని రోజుల్లోనే అర్థమయ్యింది. అప్పటికే మా వారు డీ–అడిక్షన్ సెంటర్ నడుపుతున్నారు. కొన్నిరోజులు గమనించిన తర్వాత, బ్యాంకు ఉద్యోగాన్ని వదిలేశాను. నిజానికి డీ–అడిక్షన్ సెంటర్ ఎలా పనిచేస్తుంది, మత్తు పదార్థాల నుంచి వ్యసనపరులను ఎలా బయట పడేయాలో ఏమాత్రం తెలియదు. కానీ క్రమంగా నేర్చుకున్నాను.

కాల్చివేస్తానని బెదిరింపులు..

బీహార్‌లో డీ–అడిక్షన్ సెంటర్ నడపడం చాలా కష్టం. మాదకద్రవ్యాల వ్యసనాన్ని వదిలించుకోవడానికి ఎక్కువగా నేర నేపథ్యం ఉన్న వారు వస్తారు. మంచి కుటుంబాలకు చెందిన పిల్లలు డ్రగ్స్‌కు బానిసలైతే పరువు పోతుందనే భయంతో వారిని బీహార్ నుంచి వేరే చోటకు పంపేవారు. ఇక ఓల్డ్‌సిటీలో డీ అడిక్షన్ సెంటర్‌కు వచ్చిన వారిని నిలువరించడం పెద్ద సవాలుగా ఉండేది. అలాంటి వాళ్లు మా కేంద్రానికి వచ్చి కొడతామంటూ ఉద్రేకంతో వస్తుంటారు. ఆ సమయంలో వారిపై వారికి అదుపు ఉండదు. వారి అలవాట్లను అడ్డుకుంటే బెదిరింపులు ఉండేవి. 'బయటకు వెళ్లాక చూడు.. నిన్ను కాల్చేస్తామ'నేవారు. కేంద్రాన్ని మూసివేస్తామని బెదిరింపులు. కానీ నేనేం తప్పు చేయట్లేదు. భయమెందుకు?

జైలులో డ్రగ్స్ నుంచి మహిళా ఖైదీల వరకు...

పట్నాలోని బ్యూర్ జైల్లో ఖైదీల కోసం 10 ఏళ్లపాటు డీ–అడిక్షన్ క్యాంప్ నడిపాను. మహిళాఖైదీలతో ఈ క్యాంప్ స్టార్ట్ అయ్యింది. జైలులో ఓ బాలిక తన బట్టలు చింపుకుని బీభత్సం సృష్టించింది. అప్పుడు నన్ను పిలిచారు. ఆమెను చూడగానే ఆ అమ్మాయి డ్రగ్ అడిక్ట్ అని అర్థమైంది. తనకు డ్రగ్స్ అందుబాటులో లేకపోవడంతో ఆమె అలా ప్రవర్తించింది. అప్పుడు ఇక్కడ ఖైదీలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో జైలు ఐజీకి నివేదించాను. ఐజీ అభ్యర్థన మేరకు జైలులో మూడు రోజుల పాటు డీ–అడిక్షన్ క్యాంపు నిర్వహించారు. శిబిరంలో 1000 మందికి పైగా ఖైదీలు పాల్గొన్నారు. వందలాది మంది ఖైదీలు మాదకద్రవ్యాల నుండి విముక్తి పొందారు.

వీధి

బాలలు, అనాథలు, వదిలి వేయబడిన పిల్లలు ఎక్కువగా మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారారు. అలాంటి పిల్లల కోసం ప్రత్యేక కేంద్రాన్ని ప్రారంభించాం. వీధి బాలల కార్యక్రమాన్ని కూడా నిర్వహించాం. 30–35 మంది పిల్లలకు భోజనం, పానీయం, విద్య అన్ని ఏర్పాట్లు ఉన్న చోట ఈ కేంద్రానికి వసతి కల్పించే సామర్థ్యం కల్పించాం.



నిషేధం తర్వాత..

ఒక డ్రగ్ మానేస్తే మరో మందు వాడటం మొదలుపెడతారు. బీహార్‌లో మద్య నిషేధం తర్వాత ఈ ట్రెండ్ కనిపించింది. ఇప్పుడు ప్రజలు గంజాయి, ఇతర డ్రగ్స్ ఎక్కువగా తీసుకుంటున్నారు. అయితే డ్రగ్స్‌కు బానిసలైన వ్యక్తులు మద్యం కంటే వారి వ్యసనం నుండి బయటపడటం చాలా కష్టం. నిషేధం కారణంగా, ప్రజలు డీ–అడిక్షన్ సెంటర్‌లకు రావడం మానేశారు. ఆ తర్వాత జిల్లా ఆసుపత్రుల్లో డీ–అడిక్షన్ కోసం 15 ప్రత్యేక పడకలను అందించేందుకు కృషి చేశాం. ఆ తర్వాత ఈ విషయంలో వైద్యులకు శిక్షణ కూడా ఇచ్చాం. 5 వేల మంది పిల్లలు మాదకద్రవ్యాల నుండి విముక్తి పొందారు.

మహిళల కోసం..

చాలా మంది మహిళలు తమ కుటుంబ సభ్యులకు తెలియకుండానే డ్రగ్స్ అలవాటు నుంచి బయటపడేందుకు వస్తుంటారు. మహిళల కోసం ప్రత్యేక డీ–అడిక్షన్ సెంటర్ కూడా ఉంది. చాలా మంది మహిళలు తమ గుర్తింపును దాచుకుంటారు, కొందరు తమ కుటుంబ సభ్యులకు తెలియకుండా ఇక్కడకు వస్తారు.

ఓ మహిళ భర్త దుబాయ్‌లో ఉన్నాడు. అక్కడి నుంచి ఖరీదైన మద్యం తెచ్చేవాడు. ఆమె తన బిడ్డతో ఇంట్లో ఒంటరిగా ఉంటూ మద్యం సేవించి క్రమంగా దానికి బానిసయ్యింది. పట్టించుకునేవారెవరూ లేకపోవడంతో ఆమె బిడ్డ చదువుకు దూరమయ్యాడు. దాంతో డీ–అడిక్షన్ సెంటర్‌కి వెళ్లి, కొన్ని సెషన్స్ తర్వాత నార్మల్‌గా మారింది.

అదేవిధంగా పట్నాలోని ఓ ఉన్నత కుటుంబానికి చెందిన ఓ మహిళ డ్రగ్స్‌కు బానిసైంది. ఆమె ఎంబీఏ చేసింది. తల్లి చైనాలో, సోదరుడు అమెరికాలో ఉన్నారు. ఆమె వైవాహిక జీవితం బాగోలేదు. విడాకుల తర్వాత ఆమె డిప్రెషన్‌లోకి వెళ్లిపోయింది. డీ–అడిక్షన్ సెంటర్‌కు వచ్చేటప్పటికి ఆమె శరీరంపై చాలా కోతలు ఉన్నాయి. బ్లేడుతో తానే కోసుకుని ఆనందించేది. కొన్నినెలల చికిత్స తర్వాత ఆమె సాధారణ స్థితికి వచ్చింది.

బీహార్‌కు చెందిన ఓ ఐఏఎస్ అధికారి మద్యానికి బానిసయ్యాడు. ఎంత ప్రయత్నించినా ఆ వ్యసనాన్ని వదులుకోలేకపోతున్నాడు. భార్య ప్రోద్బలంతో ఆ ఐఏఎస్ డీ–అడిక్షన్ సెంటర్‌లో చికిత్స తర్వాత తన వ్యసనాన్ని విడిచిపెట్టాడు. చాలా మంది డాక్టర్లు, ఇంజినీర్లు డీఅడిక్షన్ సెంటర్ కు వచ్చి డ్రగ్స్ అలవాటు నుండి విముక్తి పొందారు.'' అంటూ తను చేస్తున్న సేవ గురించి వివరించే రాఖీశర్మ ఎందరికో స్ఫూర్తిదాయకం.

వంటిల్లు

బఠాణితో బ్రేక్‌ఫాస్ట్...
క్యాబేజ్‌కి ఎగ్‌తో దోస్తీ... పప్పులోకి చిక్కుళ్లు.
ఊహకందని అరటికారం...
మన వంటింటి చమత్కారం

కూరలు అవే రుచులే వేరు

అరటి కాయ కారం పొడి



కావలసినవి: అరటికాయలు – మూడు; పసుపు – 1/2 టీ స్పూను; ఉప్పు – రుచికి సరిపడా; మినప్పప్పు – రెండు టీ స్పూన్లు; పచ్చిశనగ పప్పు – టీస్పూను; ధనియాలు – 2 టేబుల్ స్పూన్లు; ఎండుమిర్చి – ఐదు; మిరియాలు – టీస్పూను; ఎండు కొబ్బరి తురుము – నాలుగు టీస్పూన్లు; కరివేపాకు – ఐదు రెమ్మలు; ఇంగువ – చిటికెడు; నూనె – నాలుగు టీస్పూన్లు; ఆవాలు – అరటీస్పూను.

తయారీ: స్టవ్ వెలిగించి మీడియం మంట మీద అరటికాయలను కాల్చాలి. ● చక్కగా కాలాక మంట మీద నుంచి తీసి చల్లారాక తొక్కతీసేసి, సన్నగా తురిమి పక్కన పెట్టుకోవాలి. ● ఇప్పుడు స్టవ్ మీద బాణలిపెట్టి టీస్పూను మినప్పప్పు, పచ్చి శనగపప్పు, ధనియాలు, ఎండు మిర్చి, మిరియాలు, ఎండు కొబ్బరి తురుము, మూడు రెమ్మల కరివేపాకు, ఇంగువ వేసి దోరగా వేగాక, చల్లారనిచ్చి పొడిచేసి పెట్టుకోవాలి. ●స్టవ్ మీద బాణలిపెట్టి నూనె వేయాలి. ● వేడెక్కిన తరువాత మిగిలిన మినప్పప్పు, ఆవాలు, కరివేపాకు వేసి వేయించాలి. ● చిటపటలాడాక అరటికాయ తురుము, పసుపు, రుచికి సరిపడా ఉప్పువేసి వేయించాలి. ● తరువాత మసాలా పొడి వేసి కలిపి మూతపెట్టి, సన్న మంట మీద ఐదు నిమిషాలు మగ్గనిస్తే అరటి కాయ పొడి రెడీ.

క్యాబేజ్ ఎగ్ భుర్జి



కావలసినవి: క్యాబేజీ తురుము – రెండు కప్పులు; నూనె – మూడు టేబుల్ స్పూన్లు; ఉల్లిపాయ తరుగు – అరకప్పు; అల్లం వెల్లుల్లి పేస్టు – ఒకటిన్నర టీస్పూన్లు; పచ్చిమిర్చి – చిన్నవి ఆరు(సన్నగా తరగాలి); ధనియాల పొడి – అరటీస్పూను; పసుపు – అరటీస్పూను; కారం – ముప్పావు టీస్పూను; గుడ్లు – నాలుగు; ఉప్పు – రుచికి సరిపడా; కొత్తిమీర తరుగు – రెండు టేబుల్ స్పూన్లు.

తయారీ: స్టవ్ మీద మందపాటి బాణలి పెట్టి నూనె వేసి వేడెక్కిన తర్వాత ఉల్లిపాయ తరుగు వేసి వేయించాలి. ● ఉల్లిపాయ వేగాక, అల్లం వెల్లుల్లి పేస్టువేసి వేయించాలి. ● అల్లం వెల్లుల్లి పేస్టు పచ్చివాసన పోయిన తరువాత పచ్చిమిర్చి తరుగు వేయాలి. ● మిర్చి వేగిన తరువాత ధనియాలపొడి, కారం, పసుపు, క్యాబేజీ తరుగు, రుచికి సరిపడా ఉప్పు వేసి కలిపి బాణలి మీద మూతపెట్టి సన్న మంట మీద మగ్గనివ్వాలి. ● గుడ్లసొనను ఒక గిన్నెలో వేసి బీటర్ లేదా ఫోర్క్‌తో కలిపి పక్కన పెట్టాలి. ● క్యాబేజీ ఉడికి దగ్గర పడుతున్నప్పుడు గుడ్ల సొనవేసి కలుపుతూ వేయించాలి. ● చక్కగా వేగిన తర్వాత కొత్తిమీర చల్లుకుని దించేయాలి. ● రోస్టెడ్ బ్రెడ్, చపాతీ, రోటీలోకి ఇది మంచి సైడ్ డిష్.

గ్రీన్ పీస్ ఊతప్పం



కావలసినవి: పచ్చిబఠాణి – కప్పు; సూజీ రవ్వ – కప్పు; బియ్యప్పిండి – మూడు టీస్పూన్లు; పచ్చిమిర్చి – మూడు; అల్లం – అరంగుళం ముక్క; కొత్తిమీర తరుగు – రెండు టీస్పూన్లు; జీలకర్ర – టీస్పూను; పెరుగు – అరకప్పు; వంటసోడా– 1/2 టీ స్పూను; ఉప్పు – రుచికి సరిపడా; నూనె – ఊతప్పం కాల్చడానికి తగినంత.

తయారీ: మిక్సీజార్‌లో పచ్చిబఠాణి, పచ్చిమిర్చి, అల్లం, కొత్తిమీర, జీలకర్ర, రుచికి సరిపడా ఉప్పు వేసి తగినంత నీటిని వేస్తూ గ్రైండ్ చేయాలి. ● ఇప్పుడు ఒక పెద్ద గిన్నె తీసుకుని సూజీ రవ్వ, బియ్యప్పిండి, గ్రైండ్ చేసిన బఠాణి పేస్టు, పెరుగు కలిపి నానబెట్టాలి. ● అర గంట తరువాత రుచికి సరిపడా ఉప్పు, వంటసోడా, కొద్దిగా నీళ్లు పోసుకోని గరిట జారుడుగా కలుపుకోవాలి. ● పెనం వేడెక్కాక కొద్దిగా నూనె వేసి రెండు గరిటలు పిండి వేసి రొట్టెలా వేసుకోవాలి. దాని మీద సన్నగా తరిగిన ఉల్లిపాయ, క్యారట్, క్యాప్సికమ్ ముక్కలు వేసి మూత పెట్టి మంట తగ్గించాలి. ● ఓ నిమిషం తర్వాత మూత తీసి ఊతప్పాన్ని తిరగేసి మరో అర స్పూన్ నూనె వేసి రెండోవైపు కూడా కాల్చుకుంటే గ్రీన్‌పీస్ ఊతప్పం రెడీ. చట్నీ, సాంబార్‌తో చాలా బావుంటుంది.

చిక్కుడు కాయ పప్పు



కావలసినవి: చిక్కుడు కాయలు – పావు కేజీ; పెసరపప్పు – అరకప్పు; పసుపు – పావు టీస్పూను; పచ్చి కొబ్బరి తురుము – అరకప్పు; ఎండుమిర్చి – నాలుగు; జీలకర్ర – టీస్పూను; కరివేపాకు – నాలుగు రెమ్మలు; ఆవాలు – పావు టీస్పూను; నూనె – తగినంత; మినప్పప్పు – టీస్పూను; ఉప్పు – తగినంత.

తయారీ: పెసరపప్పుని కడిగి కుకర్ గిన్నెలో వేయాలి. ● దీనిలో కప్పునీళ్లు, పసుపు, 1/2 టీస్పూను ఉప్పు వేసి మూతపెట్టి రెండు విజిల్స్ రానివ్వాలి. ● చిక్కుడు కాయలను కడిగి ఈనె తీసి ముక్కలు చేసుకోవాలి. ● తగినన్ని నీళ్లు, చిటికెడు ఉప్పు వేసి రెండు విజిల్స్ వచ్చేవరకు ఉడికించి పక్కన పెట్టుకోవాలి. ● పచ్చికొబ్బరి, జీలకర్ర, కరివేపాకు, ఎండు మిర్చిని మిక్సీ జార్‌లో వేసి కొద్దిగా నీళ్లుపోసి పేస్టు చేయాలి. ● ఉడికిన పెసరపప్పులో.. చిక్కుడు ముక్కలు, నూరుకున్న మసాలా పేస్టు, ఉప్పువేసి కలపాలి. ● ఒక పాత్రలో నూనె వేసి వేడెక్కిన తర్వాత ఆవాలు, మినప్పప్పు వేసి చిటపటలాడాక మిగతా కరివేపాకు వేసి వేయించి అందులో పప్పు మిశ్రమాన్ని కలిపితే చిక్కుడుకాయ పప్పు రెడీ. అన్నం, చపాతీ, రోటీల్లోకి చాలా బావుంటుంది.